12 వేల టన్నుల నిమజ్జన వ్యర్థాల వెలికితీత

• నియోజకవర్గంలోని 9 చెరువుల్లో పూర్తి • వారం రోజుల పాటు శ్రమించిన సిబ్బంది



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో ..



కూకట్‌పల్లి: వినాయక విగ్రహాల నిమజ్జనం అనంతరం వ్యర్థాల వెలికితీత ముమ్మరంగా సాగింది. వారం రోజుల పాటు అధికారులు, కార్మికులు శ్రమించి నియోజకవర్గం లోని 9 చెరువుల్లో 12 వేల టన్నుల వ్యర్థాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ మూడు చెరువుల్లో ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించింది. వారం రోజులుగా వ్యర్థాలను బయటకు తీసేందుకు సుమారు 400 మంది కార్మికులు పని చేశారు. ఐడీఎల్ చెరువులో 30 వేలకు పైగా, ప్రగతినగర్ చెరువులో 5 వేల వరకు మూడు అడుగులలోపు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తే 1000 వినాయకులను మూడు అడుగుల పైన ఉన్న వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇక్కడ దాదాపు 100 మంది కార్మికులు నిరంతరం పనిచేసి దాదాపు 3 టన్నుల వ్యర్థాలను తొలగించారు. బోయిన్ చెరువులో 7500 వినాయకులను మూడు అడుగులలోపు ఉండగా 1300 వరకు మూడు అడుగులకు పై బడినవి ఉన్నాయి. ఇవి కాకుండా నియోజకవర్గంలోని సున్నం చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువు, పరికి చెరువు, ముల్లకత్వ చెరువు, ఖాజా కంట చెరువుల్లో చిన్నా చితక వినాయకులన కలిపి 50 వేల వరకు నిమజ్జనం చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 12 టన్నుల వ్యర్థాలను కేవలం కూకట్‌పల్లి నుంచి తరలించినట్లు తెలుస్తున్నది. నియోజకవర్గంలోని చెరువుల్లో వ్యర్థాల వెలికితీత పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

నాలా విస్తరణ పనులు ప్రారంభించాలి

హైడ్రా కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: లక్ష్మీనగర్ నుంచి సఫ్దార్‌నగర్ వరకు రెండవ విడత ఎస్ఎన్‌డీపీ నాలా విస్తరణ పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎప్పుడు అకాల వర్షాలు కురుస్తాయో తెలియని పరిస్థితి నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా విస్తరణ పనులు శాశ్వతంగా పూర్తి అయితే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మరమ్మతు పనుల పరిశీలన



మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తదితరులు

బాలానగర్: శాస్త్రీనగర్‌లో 30 లక్షల వ్యయంతో జరుగుతున్న కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను గురువారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో కమిటీ హాల్ రేకుల షెడ్డు ఎత్తు పెంచడం, వధూవరులకు రూమ్‌ల నిర్మాణం కోసం పనులు ప్రారంచామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుతాడి రాములు, శివశంకర్ గౌడ్ సాగర్, కృష్ణ, బద్రిశంకర్, అఫ్జల్, బొట్టు శ్రీను, ప్రభాకర్, ఉదయ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు

కూకట్‌పల్లి: అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో 1 కోటి 40 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. గురువారం ప్రశాంత్‌నగర్, రామయ్య నగర్, మైత్రినగర్, దయార్‌గూడ, మాధవరం లోకయ్య పటేల్ కాలనీ, శేషాద్రినగర్‌లోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు భీమని సంతోష్, సెక్రటరీ సీహెచ్. ప్రభాకర్, బొట్టు విష్ణు, జావిద్, ప్రేమ్, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

విధాన నిర్ణయాలకు డేటా ఆధారిత విశ్లేషణ ముఖ్యం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ రత్నాకర్ జోషి



రాయదుర్గం: విధాన నిర్ణయాలకు డేటా ఆధారిత విశ్లేషణ ఎంతో ముఖ్యమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ రత్నాకర్ జోషి పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని ఎకనామిక్స్ విభాగం ఎకాస్ లాగ్ సెమినార్ సిరీస్‌లో భాగంగా ఈస్ట్ క్యాంపస్‌లోని సెంట్రల్ ఆడిటోరియంలో 'డేటా మరియు విధాన నిర్ణయం కోసం అనుభవ విశ్లేషణ' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత డేటా ఆధారంగా ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని, అయితే భవిష్యత్ విధానాలకు సరైన అంచనాలు అవసరమన్నారు. డేటా నిల్వ, ప్రాసెసింగ్, విశ్లేషణలో పురోగతి వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో డేటా కీలంగా మారిందన్నారు. ఆర్‌బీఐ యొక్క క్వార్టర్లీ ప్రొజెక్షన్ మోడల్ వంటి నమూనాలు ద్రవ్యోల్బణం, ద్రవ్య విధాన అంచనాలకు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. అనంతరం హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ. జగదీశ్వర్‌రావు, ఎకనామిక్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ దేబాశిస్ ఆచార్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞాపరమిత మిశ్రా మాట్లాడుతూ బలమైన డేటా బేస్‌లు విశ్వసనీయతను, స్పందనను మెరుగుపరుస్తాయన్నారు. అనంతరం జరిగిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు డాక్టర్ జోషి తన దైనశైలిలో సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



బంజారాహిల్స్ సర్కిల్ నూతన కార్యవర్గ సభ్యులు

మోతీనగర్: విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ బంజారాహిల్స్ సర్కిల్ యూనియన్ అధ్యక్షుడు సంతోష్ అన్నారు. గురువారం మోతీనగర్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ బంజారాహిల్స్ సర్కిల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కారం అయ్యేంత వరకు కృషి చేస్తానని తెలిపారు. కార్మికులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్ రెడ్డి, అడిషనల్ సెక్రటరీగా మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.

నిబంధనలు పాటించని హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వెలుస్తున్న ప్రైవేట్ హాస్టల్స్‌ని నియంత్రించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి, చదువుల కోసం నగరానికి వచ్చే వారికి హాస్టల్స్ సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ అవి స్థానికంగా కాలనీలో నెలకొన్న ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్స్ ద్వారా వచ్చే అధిక అద్దెల కోసం భవన నిర్మాణదారులు ఏకంగా అనుమతులకు మించి నిర్మిస్తున్నారని వివరించారు. రెండు మూడు వందల గజాల స్థలంలో ఏకంగా ఐదు అంతస్తుల భవనాలను నిర్మించి హాస్టల్స్ నిర్వహిస్తున్నారన్నారు. కనీసం పార్కింగ్ సదుపాయం కూడా లేకుండా రోడ్ల పైనే వాహనాలను పార్కు చేయటం, పగలు రాత్రి తేడా లేకుండా హాస్టల్స్ వద్ద రద్దీ నెలకొని రోడ్లపైనే తిష్ట వేస్తుండటంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు కూడా అవినీతికి పాల్పడుతూ భవనాల నిర్మాణ సమయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని దుస్థితిలో బాలాజీనగర్, కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లలోని హాస్టల్స్ నిర్వహిస్తుండటం బాధాకరమన్నారు. ఫైర్ ఎన్‌వోసీలు కూడా లేని అనేక భవనాల్లో వందలాది హాస్టల్స్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే ప్రైవేట్ హాస్టల్స్‌ను నియంత్రించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమంగా భవనాలను నిర్మించి హాస్టల్స్‌కు అద్దెకు ఇస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

కూకట్‌పల్లి: ఆయా డివిజన్‌లలోని పెండింగ్ పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్‌లో రూ.60 లక్షల నిధులతో వరద కాలువ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిత్యం ఏదో ఒక చోట అభివృద్ధి కార్యక్రమానికి శంకుస్థాపనలు జరిగేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో కేటాయించిన నిధులను కూడా పక్కన పెట్టి పనులను పూర్తి చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అప్పటికే పలు సీసీ రోడ్లు, పార్కులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందిందని, అతి త్వరలో పెండింగ్‌లో ఉన్న పనులు కూడా పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్‌లో వరద నీటి కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

హత్య చేసిన నిందితులను శిక్షించాలి

• కాంగ్రెస్ పాలనలో అదుపుతప్పిన లా అండ్ ఆర్డర్
• ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో స్టీల్ వ్యాపారి రాకేష్‌కుటుంబాన్ని గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. స్టీల్ వ్యాపారి రాకేష్ భార్యను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వచ్చాక రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ విఫలమైందన్నారు. కూకట్‌పల్లిలో తరచూ హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చిన్నారి సహస్ర హత్య కేసు, కేపీహెచ్‌బీలో వృద్ధ దంపతులను కట్టేసి డబ్బులు ఎత్తుకెళ్లిన ఘటనలు బాధాకరమన్నారు.

క్లుప్తంగా

సన్మానం



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో అల్లాపూర్ ఎస్‌హెచ్‌ఓ వెంకట్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. గణేష్ వేడుకల నిర్వహణలో సీఐ వెంకట్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ మాజీద్ ఆలీ ఇచ్చిన సహకారం మరువలేమన్నారు. వీటీం, వివేకానందనగర్ కాలనీ ప్రజల తరపున అల్లాపూర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మొయినొద్దీన్, వీటీం ప్రధాన కార్యదర్శి రవీందర్, సీనియర్ అడ్వైజర్ చెల్లయ్య, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, పవన్‌కుమార్, యూత్ ప్రెసిడెంట్ బొంత రవి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కలుషితాన్ని అరికట్టాలి



సమస్యను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లోని ప్రగతినగర్ ప్రభుత్వ స్కూల్ పక్కన, రోడ్డు నెంబర్ 10లో తాగునీటి కలుషితాన్ని అరికట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కాలనీలో పర్యటించారు. మంచినీటిలో డ్రైనేజీ నీరు కలుషితమై వస్తున్నందున స్థానిక ప్రజలు రోగాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్‌వర్క్స్ డిపార్టుమెంట్‌కి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పల్లి ధర్మారావు, బాలరాజ్, పోలయ్య, కృష్ణారావు, లక్ష్మీనారాయణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్టింటికి వెళ్లి వస్తానని మహిళ అదృశ్యం



శిరీష (ఫైల్)

మూసాపేట: పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన ఓ మహిళ తిరిగి రాని సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మూసాపేట జనతా నగర్‌లో జే. శిరీష (23), నాగసాయి భార్యా భర్తలు. ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో తల్లి ఇంటికి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన భర్త చుట్టుపక్కల, బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ప్రక్రియ (2025–26) ప్రారంభమైంది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయగా గురువారం నామినేషన్ల ప్రక్రియను ఆరంభించారు. శుక్రవారం నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తుంది. పోలింగ్ 19న..కౌంటింగ్ 20న జరుగుతుంది.

వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు

మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ది చెన్నై సిల్క్స్, శ్రీకుమరన్ గోల్డ్ అండ్ డైమండ్స్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందజేస్తున్నట్లు స్టోర్ మేనేజర్ నాగేందర్ తెలిపారు. గురువారం మాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న మాల్ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కలెక్షన్లు, శారీస్, లేడీస్ వేర్స్, కిడ్స్ వేర్, మెన్స్ వేర్‌లలో బై వన్ గెట్ వన్ కాంబో ఆఫర్‌లు, భారీ డిస్కౌంట్‌లను అందిస్తున్నామన్నారు. రాబోయే దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని ఫెస్టివల్ కలెక్షన్స్‌ని కూడా అందుబాటులోకి తెచ్చామని వివరించారు. నగరంలో రెండు షోరూంలు ఉన్నాయని మెహిదీపట్నంలో మరో షోరూంలో కూడా ఆఫర్లు వర్తిస్తాయని తెలిపారు. సమావేశంలో ఏజీఎం రవికాంత్, పీఆర్ఓ యోగానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

